క్లుప్తంగా

సారా, మద్దికల్లును నిర్మూలిద్దాం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈబీ సిబ్బంది

గజపతినగరం: నాటు సారా, మద్దికల్లును సంపూర్ణంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) సీఐ ఎం.విజయలక్ష్మి, ఎస్‌ఈబీ సిబ్బంది కోరారు.పరివర్తన కార్యక్రమంలో భాగంగా మత్తుపదార్థాలతో కలిగే అనర్థాలపై సీఐ సూచనలతో మండల కేంద్రంలో ప్రజలకు ఎస్‌ఈబీ సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. సారాకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. యువత మత్తుపదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం



మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ మయూరి అశోక్

గుర్ల: రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేవిధంగా రెవెన్యూ అధికారులు భూ రీసర్వే పనులు చేయాలని జేసీ మయూరి అశోక్ అన్నారు. మండల కేంద్రంలో భూ రీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వేలో తలెత్తే చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏకకాలంలో భూసర్వేతో పాటు రికార్డుల పరిశీలన చేస్తేనే సర్వేత్వరగా పూర్తవుతుందని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఆయన వెంట ఆర్డీఓ అప్పారావు, తహసీల్దార్ సూర్యనారాయణ ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ రామారావు

మెంటాడ (గజపతినగరం రూరల్): గజపతినగరం మండలం డోలపాలెంలోని అప్పయ్య చెరువులో ఉపాధి వేతనదారులు బుధవారం చేపట్టిన పనులను ఏపీఓ చప్ప రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రభుత్వం నిర్ధేశించిన గరిష్ఠ వేతనం అందుతుందని చెప్పారు. వేతనదారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారా లేదా లేదా అని ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లను ఆరా తీశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



చినగుడిపాలలో ఇంటింట ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

వేపాడ: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్య అందే ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరుతున్నారు. నీలకంఠరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చినగుడిపాల గ్రామంలో బుధవారం ఇంటింట ప్రచారం చేశారు. హైస్కూల్ ఈడు పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద తదితర పథకాలను తల్లిదండ్రులకు వివరించారు.

నాలుగేళ్లలో మెరుగైన పాలన

● వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ డీవీజీ



డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాలు గేళ్లలో ఎంతో మెరుగైన పాలన అందించారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. పాలనాపగ్గాలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన నేపథ్యంలో బుధవారం ఆయన మాట్లాడుతూ... ప్రజల ఆశలు, ఆకాంక్షలు, అవసరాలను గుర్తిస్తూ వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో రూపొందించి అమలు చేయడం గొప్ప విషయమన్నారు. పాలనలో పూర్వానుభవం లేకపోయినా, యువనేత గా జగన్ మోహన్‌రెడ్డి మంచి విజ్ఞత కనబరుస్తూ, రాష్ట్రాన్ని ప్రగతిపథం వైపు తీసుకెళ్తున్నాడనని చెప్పారు. నాలుగేళ్లలో సగభాగం కరోనా దుష్ప్రభావాన్ని తట్టుకుంటూ నిలబడడం ఆయన పాలనా దక్షతకు నిదర్శనమన్నారు. సచివాలయాలు, కొత్త జిల్లాల ఏర్పాటు వంటి వినూత్న ఆలోచనలో మెరుగైన ఫలితాలు వచ్చాయని చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పలు రాష్ట్రాలు మన రాష్ట్రంలోని పాలనా విధానాల ను మెచ్చుకోవడం గొప్ప విషయమన్నారు.



చీపురుపల్లిరూరల్: నిమ్మలవలసలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ



మెంటాడ (గజపతినగరం రూరల్): వలంటీర్లను సన్మానిస్తున్న జెడ్పీటీసీ తవుడు, తదితరులు



చీపురుపల్లి రూరల్: కోనూరులో వలంటీర్లను సన్మానిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

వలంటీర్ల సేవలు అమోఘం

● ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

కొత్తవలస/జామి: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా గ్రామవలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా కొత్తవలస మండలంలోని చింతలపాలెం, దేశపాత్రునిపాలెం గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామ వలంటీర్లను, జామి మండలం విజినిగిరి సచివాలయం పరిధి వలంటీర్లను బుధవారం ఆయన సన్మానించారు. కొత్తవలస ఎంపీడీఓ వై.పద్మజ, విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, చింతలపాలెం, దేసుపాత్రునిపాలెం గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కొత్తవలస: దేశపాత్రునిపాలెంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి

గుర్ల: వలంటీర్ వ్యవస్థ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి మానసపుత్రిక అని, వలంటీర్లు మరింత బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని జమ్ము, జమ్ముపేట, గుజ్జింగివలస, పాలవలస, గూడెం గ్రామాల వలంటీర్లను బుధవారం ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ కల్యాణి, నాయకులు బెల్లాన బంగారునాయుడు, సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి పాల్గొన్నారు.

మరింత బాధ్యతగా పనిచేయాలి

బొండపల్లి: వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ ఏ.వేదవతి సూచించారు. మండలంలోని కనిమెరక, రాచకిండాం గ్రామాల్లో వలంటీర్లను ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ఘనంగా సత్కరించారు. కనిమెరక సచివాలయం పరిధి గిట్టుపల్లి గ్రామానికి చెందిన వలంటీరు వలజంగి అరుణకు సేవావజ్ర అవార్డు అందజేశారు. కనిమెరక సర్పంచ్ సిరిపురం ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల అప్పలనాయుడు, కర్రి కృష్ణ, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు పాల్గొన్నారు.



బొండపల్లి: కనిమెరక సచివాలయంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీడీఓ వేదవతి, ప్రజాప్రతినిధులు

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

మెంటాడ (గజపతినగరం రూరల్): ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని జెడ్పీటీసీ గార తవుడు అన్నారు. కొత్తబగ్గాం సచివాలయం పరిధి కొత్తబగ్గాం, పాతబగ్గాం, కొణిశ సచివాలయాల వలంటీర్లను బుధవారం సన్మానించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అభినందనీయం

చీపురుపల్లి రూరల్: వలంటీర్ల సేవలు అభినందనీయమని ప్రజాప్రతినిధులు కొనియాడారు. చీపురుపల్లి మండలంలోని నిమ్మలవలస గ్రామంలో, గరివిడి మండలంలోని కోనూరు, అర్తమూరు, దేవాడ, తోండ్రంగి గ్రామాల్లో వలంటీర్లను అధికారులతో కలిసి బుధవారం సన్మానించారు. నిమ్మలవలస లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, స్థానిక సర్పం చ్ అధికార్ల ఉమాదేవి, ఎంపీటీసీ అధికార్ల శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, గరివిడి మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, కోనూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, అర్తమూరు సర్పంచ్ పొన్నాడ కుమార్, కోనూరు సర్పంచ్ బూడి శ్రీరాములనాయుడు పాల్గొన్నారు.



జామి: విజినిగిరిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, సర్పంచ్ సూర్యారావు తదితరులు



గుర్ల: జమ్ములో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

మనబడి నాడు–నేడు పనులపై సమీక్ష

మెరకముడిదాం: మన బడి నాడు–నేడు పనులపై మండలంలోని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి శ్రీధర్‌రాజా బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పార్వతి నాడు–నేడు మొదటివిడత, రెండో విడతలో చేపట్టిన పనులను, మూడో విడతలో చేపట్టనున్న పనుల వివరాలను వివరించారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ నాడు–నేడు మొదటి, రెండు విడతల్లో నిధులు చాలక మిగిలి ఉన్న పనులను మూడో విడత పనుల్లో చేర్చుతామనిచ ఆయా పాఠశాలల్లో ఏయే మిగులు పనులు చేపట్టాల్సి ఉందో హెచ్‌ఎంలు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు స్పష్టంగా నివేదించాలని సూచించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కలిసి పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, చేపట్టాల్సిన 11 రకాల పనులకు అయ్యే ఖర్చులపై నివేదికలు తయారు చేయాలని ప్రత్యేక అధికారి తెలిపారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి సంబంధించి జూన్ నెల షెడ్యూల్‌ను తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఎంఈఓ రామారావు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారి శ్రీధర్‌రాజా

వేసవి శిబిరాన్ని వినియోగించుకోండి



శృంగవరపుకోట: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు



చీపురుపల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఇంగ్లీష్ గ్రామర్ బోధిస్తున్న ఉపాధ్యాయుడు

శృంగవరపుకోట: క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాభివృద్ధికి దోహద పడతాయని, వేసవి క్రీడా శిబిరంలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. స్థానిక కేంబ్రిడ్జ్ నారాయణ స్కూల్‌లో నడుస్తున్న సమ్మర్ షటిల్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. 17 ఏళ్లుగా క్రీడాకారులను సిద్ధం చేస్తున్న శ్రీరాములు మాస్టార్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సుమారు రూ.2లక్షల వ్యయంతో నిర్వహిస్తున్న క్రీడా శిబిరానికి సహకారం అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 25 నుంచి నిర్వహించే ఇంటర్నల్ టోర్నమెంట్స్‌లో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు ఇస్తామని చెప్పారు. శిబిరంలో శిక్షణ, వసతులు, సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్, ఎ.ఎస్. వెంకటరావు, ఎం.రామకృష్ణ, ఆనల రమేష్, ఎం.సుబ్బారావు, వి.మురళి, ఆర్.అప్పారావు, కె.శ్రీను, పి.శివ, మోపాడ శ్రీనివాసరావు, కోచ్‌లు మహ్మద్, అస్లాం. కె.సురేష్ పాల్గొన్నారు.

విజ్ఞాన తరగతులు

చీపురుపల్లి: స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు విద్యార్థులు నుంచి చక్కని స్పందన లభిస్తోంది. గ్రంథాలయాల్లో స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు గ్రామర్, గణితంలో మెలకువలతో పాటు చిత్రలేఖనం, క్యారమ్స్, చదరంగం వంటి ఆటలు కూడా ఆడిస్తున్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు 50 మందికి పైగా విద్యార్థులు రోజూ హాజరవుతున్నారు. గ్రంథాలయాధికారి బుచ్చింనాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు తరగతులు చెప్పిస్తున్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలి

విజయనగరం రూరల్: ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పర్యావరణ ఇంజనీర్ టి.సుదర్శనం తెలిపారు. మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా వీటీ అగ్రహారంలోని ఏపీఐఐసీ జిల్లా కార్యాలయం వద్ద బుధవారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణానికి ముప్పు కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించాలని, ఈ వేస్ట్‌ను తగ్గించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యానికి మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలని సూచించారు. రైతులు సేంద్రియ సాగు విధానంపై మొగ్గు చూపాలని కోరారు. భావితరాల మేలు కోసం నీటి వనరులు, అడవుల సంరక్షణకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

నేటి నుంచి వలంటీర్లకు సత్కారం

వేపాడ: గ్రామ వలంటీర్లలో ఉత్తమ సేవలందించే వారికి ప్రభుత్వం సేవా పురస్కారాలను ప్రదానం చేస్తోంది. మండలంలోని 28 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు గురువారం నుంచి ఈ నెలాఖరు వరకు సత్కరించనున్నట్లు ఎంపీడీఓ బి.ఎస్.కె.ఎన్. పట్నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 25న శింగరాయి గ్రామంలో సోంపురం,శింగరాయి, ఆతవ సచివాలయ పరిధి వలంటీర్లకు, 26న బొద్దాంలో కె.జి.పూడి, పాటూరు, బొద్దాం, 27న దబ్బిరాజుపేటలో రామస్వామిపేట, జాకేరు, దబ్బిరాజుపేట, 29న వావిలపాడులో వావిలపాడు, వీలుపర్తి, నల్లబిల్లి, 30న బల్లంకిలో కుమ్మపల్లి,బల్లంకి, బానాది, 31న వేపాడలో ఎస్.కె.ఆర్.పురం, వేపాడ, వల్లంపూడి సచివాలయాల వలంటీర్లను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

కుళాయి పనుల అడ్డగింత

జామి: మండలంలోని జె.డి.వలస గ్రామంలో తాగునీటి కుళాయి తవ్వకాల పనులను నియోజకవర్గ బహుజనసమాజ్ పార్టీ ఉపాధ్యక్షుడు గాలి చైతన్యకుమార్ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీవాసులు బుధవారం అడ్డుకున్నారు. ఎస్సీ కాలనీలో ఉన్న మినీవాటర్ ట్యాంకు నుంచి గ్రామంలోని బలిజిపేట, రజకవీధి,తదితర ప్రాంతాలకు కుళాయి పైపులైనులు వేస్తుండడం వల్ల తమ కాలనీకి సక్రమంగా నీరు అందదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 40 వేల నీటి సామర్థ్యం ఉన్న తాగునీటి ట్యాంకు నుంచి పైపు లైను వేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ కాలనీ వాసులు నిరసన తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు తొలిరోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపాల్ సీహెచ్.విజయకుమారి తెలిపారు. ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 82 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా అయిదుగురు గైర్హాజరయ్యారని, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 42మంది హాజరు కావాల్సి ఉండగా ఏడుగురు గైర్హాజరయ్యారని తెలిపారు.

జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ తనిఖీ

విజయనగరం క్రైమ్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఉన్న జీఆర్‌పీ స్టేషన్‌ను రైల్వే డీఎస్పీ బి. మోహనరా వు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైళ్లల్లో గస్తీ పక్కాగా నిర్వహించాలన్నారు. నిషేధిత వస్తువులు రవాణా చేకుండా చర్యలు తీసుకోవాలని సూచించా రు. కార్యక్రమంలో జీఆర్‌పీ ఎస్సై రవివర్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సత్కారం

విజయనగరం పూల్‌బాగ్: పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని నెల్లిమర్ల మండలం అలుగో లు బీసీ వసతి గృహ విద్యార్థి చందక మన్మథరావు కు (575 మార్కులు) విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాలకృష్ణ, తదితరులు బుధవారం సత్కరించా రు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎం. యశోధనరావు, ఏబీసీడబ్ల్యూ (అర్బన్) బీవీ రమ ణ, వార్డెన్ పతివాడ కన్నంనాయుడు, విద్యార్థి తండ్రి చందకస్వామినాయుడు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు,కాలువల నిర్మాణాలకు భూమిపూజ

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి, వసి గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణాలకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం భూమిపూజ చేశారు. తిమిడి గ్రామంలోని గంగిరెడ్ల కాలనీలో రూ.2 లక్షలు, వసి గ్రామంలో రూ.2 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించనున్నారు. ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, స్థానిక సర్పంచ్‌లు వబ్బిన త్రినాథమ్మ, ఎంపీటీసీ పడాల ధర్మారావు, వైస్ సర్పంచ్ బి.స్వామినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తిమిడిలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

రూ.90లక్షలతో రోడ్డు విస్తరణ పనులు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామ కూడలి నుంచి ఆ గ్రామానికి వెళ్లే తారురోడ్డు విస్తరణ పనులకు ఏఎంసీ నిధులు రూ.90 లక్షలు మంజూరయ్యాయని పీఆర్ డీఈ అప్పలనాయుడు బుధవారం తెలిపారు. రోడ్డు విస్తరణ చేయాలని ఎన్నో ఏళ్లుగా ఆ గ్రామస్తులు పాలకులు, అధికారులను కోరుతున్నారు. సమస్య ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దృష్టికి వెళ్లడంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం 12 అడుగుల వెడల్పుతో ఉన్న సుమారు నాలుగు కిలోమీటర్ల బీటీరోడ్డును 24 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేసే పనులు ప్రారంభమయ్యాయి. శిథిల, ఇరుకు రోడ్డుతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నా గత ప్రభుత్వంలోని పాలకులు పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడం ఆనందంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.



ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు

గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'

దత్తిరాజేరు/గజపతినగరం: దత్తిరాజేరు మండలం కోమటిపల్లిలో దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్‌కుమార్, గజపతినగరం మండలం పురిటిపెంట సచివాలయం–2 పరిధిలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఏర్పాటు చేసిన శిబిరాల్లో ఓపీ (అవుట్ పేషెంట్) సేవలు అందించారు. కోమటిపల్లిలో 70 మందికి, పురిటిపెంటలో 128 మందికి వైద్య సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గృహ సందర్శన దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపై ఉన్న రోగులకు వైద్యతనిఖీలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్య సూత్రాలతో పాటు వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వైద్య సిబ్బంది సూచనలు చేశారు.



పురిటిపెంట గ్రామంలో ప్రజలకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం

మెరకముడిదాం: మండలంలోని చినపూతికవలస గ్రామంలో అగ్నిప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. చినపూతికవలస గ్రామంలో బుధవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఆరు పూరిళ్లు దగ్ధమైన విషయం తెలుసుకున్న వెంటనే జెడ్పీ చైర్మన్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అక్కడే ఉన్న ఇన్‌చార్జి తహసీల్దార్ గిరిధర్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు గురువారం నుంచే నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ రమణమూర్తిని జెడ్పీ చైర్మన్ ఫోన్‌లో ఆదేశించారు. అలాగే బాధితులకు ప్రభుత్వం తరపున సహాయాన్ని త్వరితగతిన అందేలా నివేదికలు ప్రభుత్వానికి పంపించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. సూర్యనారాయణరాజు, స్థానిక నాయకులు ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

వీహెచ్‌ఏలకు శిక్షణ

గజపతినగరం: స్థానిక వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధి రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే) వ్యవసాయ ఉద్యానవన శాఖ సహాయకులకు(వీహెచ్‌ఏ) 2023 ఆర్థిక సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి బిందు, తుంపర సేద్య కార్యాచరణ ప్రణాళికపై గజపతినగరం ఆర్బీకే–2లో హెచ్‌ఓ ఏ.రాజశేఖర్ బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిందు,తుంపర సేద్యం ద్వారా తక్కువ నీటితో పంటలను సాగు చేయవచ్చన్నారు. ఈ విధానంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానవనశాఖ సహాయకులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శైలజ, పథక సంచాలకులు లక్ష్మీనారాయణ, స్థానిక ఏడీఏ కె.మహరాజన్, ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వీహెచ్‌ఏలకు శిక్షణ ఇస్తున్న హెచ్‌ఓ రాజశేఖర్

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



ఆసరా మూడోవిడత నగదు జమకు సంబంధించిన పత్రాలను చూపిస్తున్న మహిళలు

దత్తిరాజేరు: వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా మూడో విడత రుణమాఫీ డబ్బులు డ్వాక్రా సంఘాల సభ్యుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేయడంతో పెదమానాపురంలో లబ్ధిదారులు సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి బుధవారం ధన్యవాదాలు తెలిపారు. పెదమానాపురం గ్రామంలోని 67 స్వయం సహాయక సంఘాల్లో ఉన్న756 మంది సభ్యుల ఖాతాల్లో ఆసరా మూడో విడత కింద రూ. 35,70,268 జమ కావడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు మాటతప్పి తమని మోసం చేశారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా రుణమాఫీ డబ్బులు తమ ఖాతాల్లో జమ చేస్తున్నారని, ఆయనకు రుణపడి ఉంటామని చెప్పారు.